క్లుప్తంగా

సచివాలయ సిబ్బందికి సత్కారం



సూకురులో సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ సత్యవతి

హుకుంపేట: మండలంలోని సూకురు సచివాలయ సిబ్బంది పదిలిపై వేరే ప్రాంతంలో వెల్లడంతో స్థానిక సర్పంచ్ దనసాని సత్యవతితో పాటు గ్రామస్తులు సిబ్బందికి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. సచివాలయంలో స్థానికులతో కలిసి శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. నాయకుడు మురళీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



సంజీవనగరంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చినబాబు

రాజవొమ్మంగి: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని జడ్డంగి స్టేషన్ ఎస్‌ఐ చినబాబు కోరారు. ఆయన మంగళవారం మండలంలోని సంజీవనగరం గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా స్థానికులతో సమావేశం నిర్వహించారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, సారా వల్ల కలిగే అనర్ధాలను ఆయన వివరించారు. అడవి జంతువుల వేట కోసం విద్యుత్ వైర్లు ఉపయోగించొద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడొద్దన్నారు. మండలంలోని ఓకుర్తి గ్రామంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్టు జడ్డంగి ఎస్‌ఐ చినబాబు తెలిపారు. ఆమె నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామన్నారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దేవి ప్రియాంక

అడ్డతీగల: స్థానిక గురుకుల జూనియర్ కళాశాల ఆవరణలో ఎల్ల వరం పిహెచ్‌సీ వైద్యాధికారి దేవి ప్రియాంక ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి దేవి ప్రియాంక మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా, మలేరియా వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎల్లవరం పిహెచ్‌సీ వైద్య సిబ్బంది వెంకి, తులసి, మెలని, సత్యవేణ, రమణ, వెంకటేశ్వరరావు, కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

నమాజ్‌కు షెడ్డు ఏర్పాటు



చింతపల్లిలో ఏర్పాటు చేసిన షెడ్డు

చింతపల్లి: చింతపల్లిలో ముస్లిం మహిళలకు నమాజ్ (ప్రార్ధన) చేసుకోవడానికి వక్ఫ్ బోర్డు ఆధీనంలో షెడ్డును ఏర్పాటు చేశారు. స్థానిక ముస్లిం మహిళలకు నమాజ్ చేసుకోవడానికి గూడు ఏర్పాటుకు ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. దీంతో ఇస్తమా, జుమ్మా, ఈద్ వంటి దినాల్లో ఖాళీ స్థలంలో చుట్టూ పరదాలు కట్టి మహిళలు ప్రార్థనలు చేసుకునే పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితుల్లో ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఒక షెడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు వక్ఫ్‌బోర్డు సహకారంతో మసీదు ప్రాంగణంలో మహిళలు ప్రార్థనలు చేసేందుకు షెడ్డు ఏర్పాటు చేశారు.దీంతో ముస్లిం మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారులు జలమయం



అరకులోయలో కురుస్తున్న వర్షం

అరకులోయటౌన్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం వాతావరణం చల్లగా ఉన్నప్పటికి మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లిన గిరిజైతులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈ వర్షం వలన మెట్టు పొలాలకు నీరు చేరడంతో వరి నాట్లు వేసుకునేందుకు ఉపయోగపడుతుందని, మెట్టు భూముల్లో వేసిన చోడి(రాగులు), సామ, ఇతర కూరకాయల పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని రైతులు చెబుతున్నారు.



బోసుబెడ గ్రామం సీసీ రోడ్డుపై చేరిన వర్షపు నీరు



జ్వరాలతో బాధపడుతూ కాలినడకన ఆస్పత్రికి వెళ్లి వస్తున్న బాలికలు



అరకు ఏరియా ఆస్పత్రిలో జ్వరాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రోగులు

పడకేసిన పారిశుధ్యం

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ముందస్తు చర్యలు చేపట్టని ప్రభుత్వం
- విజృంభిస్తున్న విషజ్వరాలు

అరకులోయటౌన్: వాతావరణం మార్పులతో గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో గిరి గ్రామాల్లో డ్రైనేజీలు, కల్వర్టులు, ప్రధాన రహదారుల్లో చెత్త చెదారాలు పేరుకుపోయాయి. ఈగలు, దోమలు, ప్రబలుతున్నాయి. గ్రామాల్లో పలు ప్రాంతాలను అధ్వానంగా మారాయి. అరకులోయ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న 130 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో నేటికి కూటమి ప్రభుత్వం పారిశుధ్య కార్యక్రమం తూతూ మంత్రంగా చేపట్టడంతో సీజనల్ వ్యాధుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహారించినా ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి తప్పడం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

కొరవడిన క్లోరినేషన్

అన్ని గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్, ఫాగింగ్ తదితర పనులను చేయడం లేదని ఆయా గ్రామాలకు చెందిన పలువురు చెబుతున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో డ్రైనేజీలు, రహదారులు, ప్రధాన కేంద్రాలు, పలు లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. దోమలు, ఈగలు ప్రబలుతుండడంతో వ్యాధులు ప్రబలుతాయని ఆయా గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్యం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని చెబుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

రోగాలు వచ్చాక బాధపడడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు వ్యాధులను నియంత్రించవచ్చని చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యం క్షీణించడానికి దోమలే ప్రధాన కారణమం. వీటి వల్ల డెంగీ, మెదడు వాపు, చికున్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువని చెబుతున్నారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు ఉంటే దోమలు పెరిగి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

దోమలువృద్ధితో సతమతం

అరకులోయ మండల కేంద్రంలోని కంఠబౌంషుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇటీవల అనారోగ్యానికి గురైతే కాలినడకన ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అనంతరం తిరిగి కాలినడకన విద్యార్థిలను పాఠశాలకు తీసుకొచ్చారు. పలు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని పలువురు చెబుతున్నారు. దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో దోమలు వృద్ధి చెందడంతో రోగాలు ప్రబలుతాయని చెబుతున్నారు.



అరకులోయ అల్లూరి సీతారామ రాజు అతిథి గృహం వెళ్లే రహదారిలో పేరుకుపోయిన చెత్త

వైద్యుల సూచనలు

- వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- ఎప్పటికప్పుడు నీటి పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటిని వినియోగించాలి.
- భోజనానికి ముందుగా చేతులు, కాళ్లు, పరిశుభ్రం చేసుకోవాలి.
- వ్యక్తిగత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- మురుగునీటి ప్రాంతాల్లో క్లోరినేషన్, నేఫ్తలిన్ చల్లి దోమల లార్వాను నాశనం చేయాలి.
- ఇంటి కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.
- దోమ తెరలు కచ్చితంగా వాడాలి.

అప్రమత్తంగా ఉండాలి



ప్రతీ ఒక్కరూ ఎపిడమిక్ సీజన్‌కు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన జాగ్రత్తలు పాటించాలి. జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అరకులోయ ఏరియా ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీల్లో సిద్ధం చేశాం. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ జ్వరాలు పెరిగాయి. రోజుకు సీజనల్ వ్యాధిగ్రస్తులకు చెందిన ఓపీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. జూన్ నెలలో మలేరియా కేసులు 56, జూలై నెలలో ఇప్పటి వరకు 10 మలేరియా కేసులు నమోదయ్యాయి. ఎక్కువ మంది దగ్గు, జలుబు, జ్వరాలతో ఆస్పత్రికి వస్తున్నారు.

– రాము, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, అరకులోయ

మండల సమావేశం రేపు

కూనవరం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.00 గంటలకు ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.వి.వి.ఎస్.జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు అందరు తమ శాఖలకు సంబంధించి పూర్తి సమాచారంతో సర్వసభ్య సమావేశానికి రావాలని సూచించారు. గైర్హాజరైన వారి వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి చక్రధర్

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం పంచాయతీ, వణకరాయి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారి చక్రధర్ నేతృత్వంలో జరిగింది. చక్రధర్ మాట్లాడుతు రైతులు తమ పొలాల్లో రసాయన ఎరువులను విచ్చలవిడిగా ఉపయోగించొద్దని సూచించారు. సేంద్రియ ఎరువల ద్వారా మంచి దిగుబడిని సాధించడమే కాక పర్యావరణానికి హాని కలుగని రీతిలో వ్యవసాయం చేయవచ్చన్నారు. వరి నాటే సమయంలో వరి కట్టల చివర్లు నారు మడిలోనే తుంచాలన్నారు. దీని వలన నారుమడిలోని తెగుళ్లు, క్రిమికీటకాలు వ్యాప్తి చెందకుండా చేయవచ్చన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులకోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా ఇ నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరిగిందని, ఎవరి పేరైనా లేకపోతే వెంటనే రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఎట్టకేలకు రహదారికి మరమ్మతు



మామిడిచెట్టు వీధిలో రహదారి దుస్థితి (నాడు)



రహదారి పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి గౌతమి (నేడు)

సాక్షి ఎఫెక్ట్..

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో అధ్వానంగా రహదారులకు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని మామిడిచెట్టు వీధితో పాటు పలుచోట్ల అధ్వాన రహదారులపై ఈనెల 3న 'సాక్షి'లో 'రహదారులకు మోక్షమెన్నడు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఈవోపీఆర్డీ విజయ్, వైస్ సర్పంచ్ జగ్గనాయుడు ఆధ్వర్యంలో గ్రావెల్ వేసి రహదారిని బాగు చేశారు. త్వరలో రహదారి పూర్తిచేస్తామని వారు చెప్పారు.

ఆత్మీయ సన్మానం



బదిలీపై వెళున్న అధికారులను సన్మానిస్తున్న సిబ్బంది, స్థానికులు

జి.మాడుగుల: మండలంలో వ్యవసాయశాఖ కార్యాలయం పరిధిలో పనిచేసి బదిలీపై వెళ్తున్న మండల వ్యవసాయాధికారి, వ్యవసాయ విస్తరణ (ఆర్‌ఎస్‌కె) అధికారులను మంగళవారం ఎంపీపీ లంబోరి అప్పరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రకృతి వ్యవసాయం ప్రతనిధులు ఘనంగా సత్కరించారు. మండల వ్యవసాయశాఖ అధికారిగా పనిచేసి పాడేరు బదిలీపై వెళుతున్న ఎల్.ఆర్.వి.పాత్రుడుకు ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. మండలంలో బొయితిలి, భీరం, జి.మాడుగుల–1, సొలబం, నుర్మతి, గెమ్మెలి, కోరాపల్లి, పెదలువ్వాసింగి, పెదలోచలి, వంజరి, జి.మాడుగుల–2, వంతాల, గడుతూరు, వంజరి–2లకు చెందిన ఆర్‌ఎస్‌కెలకు బదిలీ కావడంతో ప్రజాప్రతినిధులు శాలువ లు కప్పి ఘనంగా సత్కరించారు. నూతనంగా వ్యవసాయశాఖ అధికారిగా వచ్చిన కె.వరప్రసాద్ ను సన్మానించారు. సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, కొండబాబు, సూరిబాబు, కృష్ణమూర్తి, సింహచలం, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పీసా కమిటీ సభ్యుల ఔదార్యం

పాఠశాలకు తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు



లబుడుపుట్టు పాఠశాలకు నిర్మించిన రేకుల షెడ్డు వద్ద పీసా కమిటీ సభ్యులు, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: ప్రభుత్వం,అధికారుల నుంచి స్పందన కరవై విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై పీసా కమిటీ సభ్యులు స్పందించారు. వారి ఆర్థిక సహాయంతో తాత్కాలిక రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు.ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ లబుడుపుట్టు జీపీఎస్ పాఠశాలలో 27 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలకు పక్కా భవనం లేక గతంలో తల్లిదండ్రులు రేకుల షెడ్డును నిర్మించారు. ఈ ఏడాది ఆ రేకుల షెడ్డు పాడై విద్యార్థులు చదువుకునేందుకు నీలువ నీడ కరువైయింది. పలుమార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందన లేదు.దీనిపై పీసా కమిటీ సభ్యులు స్పందించారు. మేభ పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కొచ్చొ గణపతి ఆర్థిక సహాయం అందించి, రేకులను కొనుగోలు చేశారు. పీసా కమిటీ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం శ్రమదానం చేసి తాత్కాలిక రేకుల షెడ్డును నిర్మించారు. దీంతో గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ పీసా కమిటీ ఉపాధ్యక్షుడు గణపతికి కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు సైతం పీసా కమిటీ సభ్యులు అందజేశారు. లబుడుపుట్టు పాఠశాలకు పూర్తిస్థాయి భవనం మంజూరు చేయాలని పీసా కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు. మాకవరం పీసా కమిటీ ఉపాధ్యక్షుడు దరియి పులంద్, కార్యదర్శులు బాబూరావు, లక్ష్మణ్, ప్రసాద్,నర్సింగమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం



అడ్డతీగల సంతలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

అడ్డతీగల: భారత కమ్యూనిస్టు పార్టీ, సీపీఐ అల్లూరి జిల్లాలో నిర్వహిస్తున్న రెండో మహాసభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడం పోరాటాలతోనే సాధ్యమని, ఆ పోరాటాలకు ఎర్ర జెండానే సారథ్యం వహిస్తుందన్నారు. మండలంలోని 60 శాతం గిరిజనుల భూమి గిరిజనేతరుల కబంధ హస్తాల్లోనే ఉందని ఆయన ధ్వజమెత్తారు. అడ్డతీగల సంతలో వ్యాపారులు నాణ్యతలేని వస్తువులను విక్రయించి, గిరిజనుల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారన్నారు. సంతల్లో వస్తువుల వినియోగంపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేయాలని, నాణ్యత లేని వస్తువులు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా మహాసభలకు అత్యధికంగా కార్యకర్తలు ప్రజలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు

- విద్య, వైద్య శాఖల పనితీరుపై ధ్వజం
- వాడివేడిగా సర్వసభ్య సమావేశం



తెరుచుకోని పాఠశాలలపై ఎంఈవోను నిలదీస్తున్న ఎంపీపీ సీతమ్మ, సభ్యులు



సమావేశానికి హాజరైన సభ్యులు

ముంచంగిపుట్టు: పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా నేటికి తెరుచుకొని పాఠశాలల విద్యార్థుల చదువులు ఎలా కొనసాగుతాయని, ఉపాధ్యాయులను నియమించడంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం తగదని ఎంపీపీ సీతమ్మతో పాటు సభ్యులు ఎంఈవో కృష్ణమూర్తి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. మండల విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి విద్యాశాఖ పనితీరుపై వివరిస్తూ ఉండగా సభ్యులు కలుగుజేసుకొని మండలంలోని చాలా ప్రాంతాల్లో పాఠశాలలు, భవనాలు లేని పాఠశాలలు, సక్రమంగా విధులకు వెళ్ళని ఎంటీఎస్ ఉపాధ్యాయుల పనితీరుపై ప్రశ్నలు కురిపించారు.41 పాఠశాలలు నేటికి మూతబడే ఉన్నాయని, ఉన్న ఉపాధ్యాయులను బదిలీపై అక్కడ ఉపాధ్యాయులను నియమించకపోవడం అన్యాయమన్నారు. పాఠశాలలకు భవనాలు లేక పాకల్లో గిరిజన విద్యార్థులు చదువులు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తల్లికి వందనం సైతం వివిధ కారణాలతో చాలా మందికి జమకాలేదని సభ్యులు ఎంఈవోను నిలదీశారు. విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంఈవో కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక సీహెచ్‌సీ, లబ్బూరు, కిలగాడ పీహెచ్‌సీల్లో వైద్య సేవలు, సిబ్బంది కొరత, నెలకొన్న సమస్యలు, గ్రామస్థాయిలో వైద్య సేవల పరిస్థితిపై సూపరింటెండెంట్ గీతాంజలి, వైద్యాధికారులు శ్యాంప్రసాద్, శిరీషలను సభ్యులు నిలదీశారు. ఆర్‌డబ్ల్యూస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల పనితీరుపై అధికారులు, సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని, అభివృద్ధి పనులపై సర్పంచులు, ఎంపీటీసీలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి, పీఆర్ ఏఈ మురళీకృష్ణ, జీసీసీ మేనేజర్ కుమారస్వామి, సీడీపీవో విమలకుమారి, ఏవో మురళీకృష్ణ, ఏపీఎం కళావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖాల అధికారులు పాల్గొన్నారు.

16 మంది గిరిజన బాలికలు ఎంపిక



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కాకినాడ ఎన్‌సీసీ పీఐ హవల్దార్ జగదేవ్ సింగ్

గంగవరం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఎన్‌సీసీ 6వ బ్యాచ్‌కి మంగళవారం విద్యార్థుల ఎంపిక నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ 3ఏ ఎన్‌సిసి పిఐ హవల్దార్ జగదేవ్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం, క్రమశిక్షణ, శరీర ధారుడ్యం, వ్యాయామం, ప్రజా సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఆశ్రమ పాఠశాలకు చెందిన 16 మంది గిరిజన బాలికలను ఎంపిక చేశారు. ఎంపికకు వివిధ పరీక్షలను నిర్వహించారు. ఎన్‌సీసీ హవల్దార్ సూర్య బహదూర్, పాఠశాల ఎన్‌సిసి ఇన్‌చార్జి జయలక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.వి.విజయలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ లావణ్య, పీడీ చిన్నపాప, పీఈటీ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభించాలి

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతన భవనం ప్రారంభించి, భోజన సదుపాయం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఐసుబాబు అన్నారు. విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో సుమారు 500 మంది అభ్యసిస్తున్నారన్నారు. నూతన భవనం నిర్మాణం పూర్తి చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో వసతి గృహం నుంచి సుమారు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న కళాశాలకు రాకపోకలు సాగించేందుకు విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఐటీడీఏ అధికారులు స్పందించి వసతి గృహాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాయకుడు రామన్న, విద్యార్థినులు మహాలక్ష్మీ, గౌరి, సరోజ, జ్యోతి, అనుష్క, నాగశ్రీ, దివ్య పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

చింతపల్లి: అధాని స్మార్ట్ మీటర్లు ఏర్పాటును విద్యుత్ వినియోగదారులు అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మండలంలోని కొత్తవీధి గ్రామంలో సీపీఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలను మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్‌తో కలసి మంగళవారం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ విద్యుత్ మీటర్లు ద్వారా వచ్చిన బిల్లులు చెల్లించడానికి 15 రోజులు గడువు ఉంటుందని, ఈలోగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేసే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్నటివంటి స్మార్ట్ మీటర్లు వలన బిల్లులు మూడోంతులు పెరగడంతో పాటు సెల్ ఫోన్ బిల్లు మాదిరిగానే ముందుగానే విద్యుత్‌ను కొనుగోలు చేసుకోవాలన్నారు. దీంతో వినియోగదారులకు బిల్లుల కష్టాలు ప్రారంభం కానున్నట్టు చెప్పారు. ఈ విధానం వలన మండలాలు, గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం ఎప్పుడు నిలిచిపోతుందో తెలియక చిన్న చిన్న పరిశ్రలు మూతబడే అవకాశం ఉంటుదన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు విధానాన్ని ప్రతి ఒక్కరే వ్యతిరేకించాలన్నారు. నాయకులు ధనుంజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రాజవొమ్మంగి: జడ్డంగిలో వ్యవసాయ గోడౌన్ ప్రారంభ కార్యక్రమానికి సమాచారం ఇవ్వలేదని జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భవనాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష, కూటమి నాయకులతో కలసి సోమవారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కాగా ఈ కార్యక్రమానికి తమను ఆహ్వానించలేదని మురళి, ఎంపీటీసీ సభ్యురాలు కానెం అచ్చమ్మ అన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతికి కూడా ఆహ్వానం అందలేదని మురళీ చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

చింతపల్లి నియోజకవర్గ కేంద్రంగా ప్రతిపాదనకు డిమాండ్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య పడాల్

చింతపల్లి: చింతపల్లి నియోజకవర్గ కేంద్రంగా వచ్చే ఏడాది జరిగే నియోజకవర్గ పునర్విభజనలో ప్రతిపాదనలు పంపాలని చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య పడాల్ డిమాండ్ చేశారు.ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో చింతపల్లి కేంద్రంగా ఉన్నటువంటి నియోజకవర్గంలో చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు, గొలుగొండ మండలాలు పూర్తిగాను నాతవరం, నర్సీపట్నం, రోలుగుంట మండలాల్లో కొన్ని పంచాయతీలుగా ఉండేవన్నారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో చింతపల్లి, జీకె వీధి, కొయ్యూరు మండలాలను పాడేరు నియోజకవర్గంలో విలీనం చేశారన్నారు. దీంతో ఎంతో చారిత్రాత్మక చరిత్ర కలిగి చింతపల్లి కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అల్లూరి నడయాడిన చరిత్ర ఉన్న చింతపల్లి పూర్తిగా ప్రాభవాన్ని కోల్పోయి విద్య, వైద్యం, ఉద్యోగ,ఉపాదితో పాటు ఆర్థికాభివృద్ధికి నోచుకోక ఈ ప్రాంతం నిర్వీర్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం నుంచి ప్రభుత్వ రంగ సంస్థలు తరలిపోవడం మినహా ఇక్కడ కొత్త సంస్థలు ఏర్పడిన పరిస్థితులు లేవన్నారు. 2026లో చేపట్టే నియోజకవర్గ పునర్విజనలో భాగంగా చింతపల్లి నియోజకవర్గ కేంద్రంగా ప్రతిపాదనలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలని కోరారు. ఈ నియోజకవర్గ ఏర్పాటుకు ఈ ప్రాంత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ వర్గాల ప్రతినిదులు ప్రజలు ముక్త కంఠంతో తమ వాణిని వినిపించాలని కోరారు.వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి గణబాబు, వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, నాయకులు గంగన్న పడాలు, కిట్లంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.